# ఆడపిల్లయితే నేం?



"ఏవమ్మో! నర్సమ్మో! నీకేం పనీపాటా లేనట్టుందే. కోడిపిల్లను తన్నికెల్లటాకి ఇంటి మీద గద్ద తిరుగుద్ది చూడు, అట్టా మా ఇంటి చుట్టూత తిరుగుతున్నావేందంట కత? ఏదోరకంగా ఏమార్చి నా కోడలికి ఆపరేషను చేయిద్దామనుకొంటున్నావేమో! ఆ పప్పులేం వుడకవు.

ఆడపిల్లలు ఎందరు పుట్టేది, మగపిల్లాడు పుట్టకుండా ఆపరేసను చేయించుకొనేది మాత్రం లేదు. ఇదే సెప్తున్నా, మళ్లీ మా ఇంటి చుట్టుపట్లగాని కనిపిత్తే మర్యాదుండదు" అంటూ కొనేటయ్య ఇంత గొంతేసుకొని పడ్డాడు ఇంటి కొచ్చిన మహిళా ఆరోగ్యకార్యకర్త శ్యామల మీద.

అసలు తనెందుకొచ్చిందీ విషయం తెలుసుకోకుండానే ముసలాయన అలా దాడి చెయ్యటం శ్యామలకు బాధనిపించింది. రెండు నెలల క్రితం కోనేటయ్య కోడలు పద్మ, రెండో కాన్పవుతూనే ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకోటానికి సిద్ధపడింది. ఆ విషయం తెలుసుకొన్న కోనేటయ్య కోడలు పిల్ల వెళ్లటానికి వల్లగాదంటూ ఇంటిముందు బైటాయించాడు. కొడుకు రాజయ్య నచ్చజెప్పబోతే ఇంతెత్తున లేచాడు. మగనలుసు పుట్టకుండా ఆపరేషన్ ఏంటని అల్లరల్లరి చేశాడు. తండ్రిమీద గౌరవంతో రాజయ్య అడ్డుచెప్పలేకపోయాడు. ఇప్పుడా విషయం దృష్టిలో పెట్టుకునే కోనేటయ్య ధ్వజమెత్తటం.

"ఎందు కాయమ్మనాడిపోసుకోటం! మనం మంచి కోసం గాదా ఏం చెప్పినా, ఏం చేసినా"? అంటూ పద్మ శ్యామల పక్షాన మాట్లాడబోయింది.

"మనం మంచికోసమెట్టా! ఏదో ఆళ్ల పొట్టతిప్పలకోసం గాదా ఉజ్జోగాలు చెయ్యటం. చేసిన మంచి చాల్లే, పొమ్మనిక" అంటూ దులపరించేశాడు కోనేటయ్య.

ఆ మాటలకు శ్యామల కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నిజానికి తనొచ్చింది, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ గురించి చెప్పటానికి. ఐదేళ్ల లోపు పిల్లలున్న ఇంటింటికీ తిరిగి చెప్తోంది, ఆదివారం పిల్లల్ని స్కూలు దగ్గరకు తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయించుకొమ్మని. ఫ్యామిలీ ప్లానింగ్ మోటివేషన్‌కి వచ్చానని ముసలాయనకు కోపం వచ్చినట్లుంది.

ఒక్కోసారి శ్యామలకు ఎందుకొచ్చిన ఉద్యోగంరా బాబూ ఇదని విరక్తి పుడుతోంది. చేసేది కాంట్రాక్టు ఉద్యోగం. ఏమాత్రం భద్రత లేదు. వచ్చే కొద్ది జీతం నెలనెలా రాదు. ఏ నాలుగైదు నెల్లకో ఒకసారి వస్తుంది. ఐదేళ్ళుగా ఉదయం నుంచి సాయంత్రం దాకా గానుగెద్దు చాకిరి.

గ్రామంలో చావుపుట్టుకల నమోదు, జ్వరాలు, పిల్లలకు వేక్సిన్‌లు, బాలింతల సంరక్షణ, ప్రసవాలు, శిశుమరణాల నివారణ, కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లు, ఇంకా ఆరోగ్యపరంగా ఏ కొత్త పథకం వచ్చినా అమలుకు, డేటాలకు తమ మీదే

అధికారుల సవారి. నెలనెలా టార్గెట్‌లు, సతాయింపులూ సరేసరి. ఒక్కోసారి విసుగుతో పాటు ఏడుపొచ్చేస్తుంది.

"పెద్దాయన మాటలేం పట్టించుకోకండమ్మా! పిల్లలిద్దర్నీ తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయిస్తాను. ఇంకా మా వాళ్లందరికీ చెప్తాన్లేమ్మా!" ఎంతో మర్యాదగా సాగనంపింది పద్మ.

జనాభా నియంత్రణ వలన కలిగే ప్రయోజనాల్ని జనం ఎందుకు అర్థం చేసుకోరు! బతిమాలో, బామాలో, బహుమతులు ఎరజూపో కుటుంబనియంత్రణ అమలు చేయించాల్సిన అగత్యం ఎంత కాలం? ప్రజల క్షేమం కోరి వేల కోట్లు సంక్షేమపథకాలకు ఖర్చుబెట్టున్న ప్రభుత్వం పిల్లలు కనటం విషయంలో పరిమితి పాటించేలా ఎందుకు చట్టం చేయలేదు. జనాభా పెరుగుదల మీద అదుపు లేకుండా పోవటం వల్లనే కదా దేశాభివృద్ధి కుంటుపడుతోంది. కోటానుకోట్లుగా పెరుగుతున్న జనాభాకు పరిమితంగా వుండే సహజ వనరులు ఎంతకాలం అందుబాటులో వుంటాయి? చైనా దేశంలో బిడ్డలు కనటం మీద వున్న ఆంక్షల గురించి తను పుస్తకాల్లో చదివింది. జనాభా పెరుగుదల వల్ల నానాటికి సమస్యలు పెరిగిపోతున్నాయి. పేదరికం, కాలుష్యంతో మానవజీవితం దుర్భరమవుతున్నది. వీటన్నింటిని దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం జనాభానియంత్రణకు చట్టబద్ధంగా ఎందుకు పూనుకోకూడదు? ఇట్లా శ్యామల బుర్రనిండా రకరకాల ఆలోచనలు. అప్పుడప్పుడూ సహోద్యోగులతో తర్కించబోతుంది. తమ లాంటి చిన్న ఉద్యోగులకు అంత పెద్ద పెద్ద ఆలోచనలు ఎందుకంటూ వాళ్లు తేలిగ్గా కొట్టిపడేస్తుంటారు.

"ఓ నర్సుగారూ!" వెనకనుంచి ఎవరిదో పిలుపు వినిపించి శ్యామల ఆగింది.

"పిల్లాడికి పొద్దుట్నుంచి విరేచనాలమ్మా! బిళ్లలుంటే ఇస్తావామ్మా!" అడిగిందొకామె.

"అలాగే!! నాతో సబ్‌సెంటర్ దాకా రా, ఇస్తాను. బిళ్లలు అక్కడున్నాయి" చెప్పి ముందుకు నడిచింది శ్యామల. ఆ గ్రామస్థురాలు అనుసరించింది.

◆ ◆ ◆

"పొద్దుట నర్సుగారొస్తే మీ నాయన మంచీ మర్యాద లేకుండా నోరు పారేసుకున్నాడు. ఇట్టా ఇంటికల్లే వస్తే మర్యాదగుండదంటూ చెలిగి పారేశాడు." సాయంత్రం మొగుడికి అన్నం పెడ్తూ చెప్పింది పద్మ.

"వయసు మీద ముసలాయనకు కాస్త చాదస్తం ఎక్కువైనట్టుంది లేవే. ఆ చెవితో యిని ఈ చెవిగుండా వదిలెయ్యటమే" అన్నాడు నవ్వుతూ రాజయ్య.

"నీకు నవ్వులాటగానే వుంటది. మాట పడ్డోళ్లకి తెలుసుద్ది ఆ బాధేంటో. ఆ నర్సమ్మ ఎంత మంచి మనిషో మీ అబ్బాకొడుకులకేం తెల్సు. కడుపుతో వున్నప్పుడు డాక్టర్‌కి చూపించింది. రక్త పరీక్షలు చేయించి, ధనుర్వాతం రాకుండా ఇంజీషన్లు చేసింది. మంచి ఆహారం తినటానికని మొత్తం 700 డబ్బిప్పించింది. బలానికి మందులిచ్చింది. నొప్పులొస్తూనే ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రసవం అయ్యేదాకా వుండి ఎంత సాయం జేసింది?" పద్మ మాటల్లో ఎంతో కృతజ్ఞత కనిపించింది.

"నే కాదంటే గదే! మగపిల్లాడు లేకుండా ఆపరేసనేంటని మా నాయనకు కోపంగుందిలే."

"ఎడాపెడా నలుగురు బిడ్డల్ని కని పెంచగలిగేరోజులా ఇవి. ఒక బిడ్డను కనటమంటే ఆడదానికి మళ్లీ ఒక జన్మ ఎత్తటం లాంటిది. మీకేం మగాళ్లు, తేలిగ్గా కనిపడెయ్యమంటారు. కాన్పుల మీద కాన్పులొస్తే ఆరోగ్యాలు చెడి బతికినంతకాలం నరక బాధలు పడేది మేము" చిర్రుబుర్రులాడింది పద్మ.

"వంశం పేరు నిలబెట్టేవోడు, కన్నోళ్లకి కడకు తలకొరివి పెట్టాల్సినోడు కొడుకని శాత్రాలు చెప్పటం లేదా?" సమర్థించుకోబోయాడు.

"ఇంకా ఆడా మగా తేడాలేందంటా? ఆడోళ్లు మగాళ్ల కన్నా ఎందులో తీసిపోతన్నారు. సంసారాల్లో బరువు బాధ్యతలు ఆడాళ్లు పంచుకోటం లేదా? చదువు సంధ్యల్లేని నా బోటోళ్లు కూలి నాలి చెయ్యటం లేదా? రైతు కుటుంబాల్లో ఆడోళ్లు పొలం పన్లు చెయ్యటం లేదా? చదువుకున్నోళ్లు పెద్ద పెద్ద ఉజ్జోగాలు చెయ్యటం లేదా? రాజకీయాల్లోకి దిగి పెసిరెంట్లూ, మంత్రులయి పరిపాలన చెయ్యటం లేదా? మన ఇందిరమ్మ ఏకంగా దేశాన్ని ఏలలేదా?" పద్మ మాటల్లో ఆవేశం తొంగి చూచింది.

"ఎంతయినా ఊళ్లల్లో డ్వాక్రా గ్రూపులు, మహిళా మండళ్లు పెట్టాక మీ ఆడాళ్లతో మాట్టాడటం కష్టంగానే వుందిలే" అంటూ ఉడికించబోయాడు.

"ఈ పోసుకోలు మాటలకేంగాని, మీ నాయనకు ఎట్టా నచ్చజెప్పుతావో చెప్పుకో. ఈ సారి మాత్రం ఆపరేసను చేయించుకొనేది చేయించుకొనేదే!" తెగేసి చెప్పింది మొగుడికి.

◆ ◆ ◆

"రాజయ్యా! ఇయ్యాల మనూళ్లో గొప్ప యిచిత్రం జరగబోతావుంది. చూడ్డానికి రెండు కళ్లు చాలవంటే నమ్ము" అంటూ బోసు హడావిడిగా పెద్ద విశేషం ఏదో మూట గట్టుకొచ్చాడు.

"ఏంట్రా అంత గొప్ప యిచిత్రం?" ఆసక్తిగా అడిగాడు రాజయ్య.

"కన్నతండ్రి పోతే తలకొరివి పెట్టాల్సిందెవరంటా?"

"కొడుకు!"

"అయితే అదెట్టా విశేషం అవుద్ది! కూతురు తలకొరివి పెడ్తే గొప్ప యిశేషం గదూ?" కనుబొమ్మలు ఎగరేశాడు.

"ఓర్నీ! మనూళ్లో ఏ ఆడకూతుర్రా కన్నతండ్రికి తలకొరివి పెట్టబోతావుంది?" నమ్మలేనట్లు అడిగాడు రాజయ్య.

"కుటుంబరావు మాస్టారు లేడూ, ఆయన కూతురు లక్ష్మంట."

"ఏది, భర్త క్యాన్సరొచ్చి చనిపోతే, పుట్టింటి కొచ్చి తలదాచుకొంది. ఆయమ్మేనా?"

"అవున్రా! ఆవిడకు ఒక కూతురుంది. ఇంటరో, బొంటరో చదువుతందిలే."

"అదేంట్రా! మాస్టారుగారికి ఇద్దరు కొడుకులుండాలి. ఎక్కడో ఉద్యోగాలు చేసుకొంటూ బతుకుతున్నారు. ఒక్కడన్నా రాకపోవటం ఏంది?" సందేహంగా అడిగాడు రాజయ్య.

"ఆ సంగతే మరిప్పుడు మనకు తెలవాల్సింది. పద వెళ్దాం" అంటూ రాజయ్యను శ్మశానం కేసి బయల్దేరదీశాడు.

అప్పటికే ఆ ఊరి జనం సగమంది శ్మశానం దగ్గరకు చేరారు. ఆ వింత చూడటానికనో, ఆడకూతురికి సంఘీభావంగానో పెద్ద సంఖ్యలో ఆడా, మగా అక్కడికొచ్చి గుమికూడారు. ఈ క్రతువులో అనుభవమున్న ఇద్దరు పెద్దలు నడుంబిగించి లక్ష్మిచేత దహన సంస్కార కార్యక్రమాన్ని చేయిస్తున్నారు.

"అరెరె! ఇద్దరు కొడుకులుండీ ఒక ఆడకూతురి చేత తలకొరివి పెట్టించటం ఎంత అనాచారం!" అంటూ ముక్కు మీద వేలేసుకొన్నాడు కోనేటయ్య.

"ఈ రోజుకది అనాచారమేవోగాని రేపట్నుంచి ఇదే ఆచారమవుద్దిలే పెద్దయ్యా" ఎవరో కుర్రాడందుకొన్నాడు.

"అదెట్టా ఆచారంరా సన్నాసోడా! తప్పుని నలుగురూ నిలదియ్యొద్దా?" అన్నాడు కోనేటయ్య.

"పెద్దయ్యా! ఇక్కడ తప్పుబట్టాల్సింది ఆవిణ్ణిగాదు కన్నకొడుకుల్ని. కన్నోళ్లు, తోడబుట్టినోళ్లు అన్న ప్రేమలేకుండా ఆస్తులకోసం గోతి కాడ నక్కల్లా కాచుకునే నా కొడుకుల్ని తన్ని బుద్ధి చెప్పొద్దాంట" ఉద్రేకపడ్డాడు వార్డ్ మెంబర్ కోటయ్య.

"అసలు గొడవేందిరా?" ఉత్కంఠగా అడిగాడు బోసు.

"తలచెడిన కాడ్నించి ఆయమ్మ తండ్రినే అంటిపెట్టుకొని వుండింది కదా! ఇన్నేళ్ల బట్టి ఆ ముసలాయన్ని తన బిడ్డతో పాటు సాకిందా లేదా?"

"అవునవును. ముసలాయన ఏడాది కాలంగా పక్షవాతంతో మంచానపడితే అన్ని ఎత్తి పొయ్యటమే నాయె! ఏనాడన్నా కొడుకులుగాని, కోడళ్లుగాని తొంగి చూచిన పాపాన పోలేదంట."

"కష్టకాలంలో కనిపెట్టుకొని చూచిందన్న ప్రేమతోనే ఇల్లు కూతురి పేర పెడతానన్నాడంట ముసలాయన."

"పసుపు కుంకుమల కింద పొలం రాసిచ్చాక, ఇంకా చెల్లిలిపేర ఇల్లు పెట్టాల్సిన అవసరమేందన్నారట కొడుకులు."

"మనవరాల్ని ఒక అయ్యచేతిలో పెట్టటానికి ఆ పొలం లేకపోతే ఎట్లా కుదురుద్దన్నాడట. కూతురు చేసిన గాడిద చాకిరీకి తలదాచుకోను ఇల్లు ఇవ్వటం ధర్మం అన్నాడట ముసలాయన. ససేమిరా వల్లగాదన్నారట కొడుకులిద్దరూ. కాదు కూడదని దాని పేర ఇల్లు గనుక పెడ్తే చచ్చాక తలకొరివి పెట్టం పొమ్మన్నారట. చచ్చాక నా తలకొరివి ఎవరు పెట్టేది నేను చూడొచ్చానా, నా కూతురి సుఖం నాకు ముఖ్యమంటూ, ఆ పిల్ల పేర ఇల్లు రాసిపారేశాడట చావబోతూ, ముసలాయన. దాంతో తండ్రి పోయాడన్న కబురెల్లినా, పంతం కొద్దీ ఇటు తొంగి చూడలేదట కొడుకులు." సంగతంతా పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చాడు కోటయ్య.

"థూ! అట్టాంటి కొడుకులు పుడితేనేం, పుట్టకపోతేనేం?" అంటూ తుపుక్కున ఎవరో ఉమ్మేశారు.

అక్కడకు గుంపులుగా చేరిన జనం రకరకాలుగా వాఖ్యానించటం, చర్చించుకోవటం కొనసాగుతుండగానే కుటుంబరావు నిర్జీవదేహాన్ని పాడె మీద నుంచి, 'హర హర మహా దేవ' అంటూ నలుగురు మనుషులు చితిమీద పెట్టారు. లక్ష్మి భుజం మీదకు నీళ్ల బుంగ ఎత్తారు. చితి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే కొడవలితో మట్టి బుంగకు చిల్లులు పెట్టారు. ప్రదక్షిణలు చేస్తూనే భుజం మీది బుంగను ప్రక్కకు

పడేసింది. భళ్లున బద్ధలైంది. కొరివితో చితికి నిప్పుపెట్టించి ఆమెను దూరంగా తీసుకెళ్లారు తోటి ఆడంగులు.

మానవత్వంలేని కొడుకుల ధిక్కారానికి ధీటైన జవాబుగా సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన లక్ష్మిని సాటి స్త్రీలంతా గొప్పగా మెచ్చుకొంటున్నారు. ఊరికేసి నడుస్తున్న ఆమె అడుగుల్లో అడుగులేస్తూ ఎందరో స్త్రీలు కదం తొక్కుతుంటే స్త్రీ పురుష వివక్షకు రోజులు దగ్గర పడుతున్నట్లే ననిపించింది.

"అక్కరకు రాని కొడుకులు ఎందరుండి ఏం లాభం! ఇట్టాంటి ఆడకూతురు ఒక్కరుంటే చాలదా?" అంటూ కోటయ్య చేసిన వాఖ్యానం తండ్రీ కొడుకుల హృదయాల్లో బలంగా నాటుకొంది.

పదిరోజులపాటు కోనేటయ్య మనసులో ఆనాటి సంఘటనే బొమ్మ కట్టినట్లు పదే పదే గుర్తుకు రాసాగింది. లక్ష్మి గుండెధైర్యాన్ని మెచ్చుకోకుండా వుండలేక పోయాడు.

"ఇదుగో అయ్యా! ఆడో, మగో చూచి కంటామా చెప్పు. మళ్లీ మళ్లీ ఆడపిల్లలే పుట్టొచ్చు. అప్పుడేం చేస్తాం? కడతేరుస్తామా? పెంచి పోషించాల గదా! మన లింగయ్య మావ సంగతేంది చెప్పు. మగపిల్లాడి కోసమని ఆరుగురు ఆడపిల్లల్ని పుట్టించాడు. ఆరో కాన్పులో ధనుర్వాతం వచ్చి అత్తయ్య చనిపోయిందా? ఇందరు పిల్లల్ని సాకేదెట్టాగని మళ్లీ పెళ్లాడాడు. ఆమెకు మళ్లీ ఇద్దరాడపిల్లలు. ఇందరాడపిల్లల్ని నేను సాకలేను పొమ్మంటూ పుట్టింటికి పారిపోయిందా? చివరికా సంసారం కుక్కలు చింపిన విస్తరైంది. కన్న బిడ్డల్ని సక్రమంగా పెంచి పోషించలేక గాలికొదిలేశాడు. ఆడా, మగా ఎవర్ని కన్నామన్నది కాదు ముఖ్యం, ఎంత ప్రయోజకుల్ని చేశామన్నది ముఖ్యం" అంటూ కొడుకు తనతో పదే పదే చేసిన వాదనల్లోని నిజానిజాల గురించి ఆలోచించటం మొదలెట్టాడు కోనేటయ్య.

ఏ కాలానికి తగ్గ ఆలోచనలు ఆ కాలపు మనుషులకుంటాయి. తమ కాలంలో కన్నబిడ్డలే సంపద అనుకొనేవాళ్లు. ఎందరు సంతానముంటే అంత ఘనం. చేతినిండా పని, చేసిన పనికి తగిన ప్రతిఫలం, బతుకుదెరువుకి లోటుండేది గాదు. ఇప్పుడట్టా కాదు. జనం పెరుగుదలకి తగ్గట్టు వనరులు పెరగటం లేదు. తిండీ, బట్టా, తలదాచుకోను నీడా కరువైపోతంది. అది గ్రహించే ఈ కాలం వాళ్లు తమ స్థోమతుకి తగ్గట్టు ఒకరిద్దరు బిడ్డలతోనే సరిపుచ్చుకోవాలనుకుంటన్నారు. వాళ్ల ఇష్టానికి తగ్గట్టు వాళ్లని బతక నివ్వకుండా తనలాంటి వాళ్లు అడ్డుపడాలని చూస్తున్నారు. పిల్లలకు

మంచి సలహాలిస్తూ తలలో నాలుకలా వుండాల్సిన పెద్దలు, పిల్లలకు తలనొప్పులు తెచ్చి పెట్టటం ఎంత వరకు సబబు? ఆలోచించిన మీదట కోనేటయ్యకు తను చేస్తున్న తప్పేంటో తెలిసొచ్చొంది.

"రాజయ్యా! ఆడో, మగో ఎవరైతే నేం? ఉన్న బిడ్డలిద్దరే నీకు చానా! నా మాటలకేంగాని, మీకేది మంచనిపిస్తే అది చెయ్యండిరా" అన్న తండ్రి మాటల్లోని మార్పుకు రాజయ్య ఆశ్చర్యపొయ్యాడు.

రాజయ్య తండ్రన్న మాటలు పద్మ చెవినేసేసరికి, "రేపే నర్సు గారికి చెప్పేస్తాను; మంచి రోజు చూచుకొని ఆపరేషన్ చేయించు కొంటానని" అంటూ సంతోషపడిపోయింది.

"ఆపరేషన్ నువ్వేం చేయించుకోనక్కర్లేదులే" అన్నాడు సీరియస్‌గా రాజయ్య.

ఆ మాటలకు తెల్లబోయింది. ఆనందమంతా ఒక్కసారి పాలపొంగులా అణగారిపోయింది.

"ఏంలేదే! వారం క్రితం నేనే రహస్యంగా పిల్లలు పుట్టకుండా వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకొన్నా. మీ ఆడోళ్లకన్నా మాకే ఎంతో సులువని నర్సమ్మ చెప్పింది" అంటూ భార్యను గుండెల మీదకు తీసుకొంటూ నింపాదిగా చెప్పాడు రాజయ్య.

❄

*(రచనా కాలం, ఆగస్టు 2011)*